01ATP30F_01ATP30F.qxd 30-05-2025 PM 10:38 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 31 మే 2025 పేజీలు : 04


# ఉద్యోగుల పదోన్నతులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం

## - జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ



పదోన్నతుల ఉత్తర్వులు అందిస్తున్న జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం సిటీ, మే 30 ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల పదోన్నతులకు తమ పాలక వర్గం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పరిధిలోని రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా ఆరు మందికి పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పి చైర్మన్ ఛాంబర్‌లో జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, జడ్పిసిఇఓ వెంకటసుబ్బయ్యతో కలిసి పదోన్నతుల ఉత్తర్వులను అందించారు. భీమయ్యకు గుమ్మఘట్ట జడ్పి హైస్కూల్, ఫకృద్దీన్ సిద్దరాంపురం జడ్పిహెచ్ఎస్, లక్ష్మన్న జడ్పిహైస్కూల్ నాగసముద్రం, సాధిక్‌బాషా తగరకుంట జడ్పిహెచ్ఎస్, హరికృష్ణ జడ్పిహెచ్ఎస్ ముదిగుబ్బ, వెంకటేషులు జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ కళ్యాణదుర్గంలకు కేటాయిస్తూ ఉత్తర్వులు అందించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులు జిల్లా పరిషత్‌కు మంచి పేరు తెచ్చేలా పని చేయాలని సూచించారు. సమావేశంలో కార్యాలయ ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్ నామస్మరణకే మహానాడు పరిమితం

### - 4న వెన్నుపోటు దినోత్సవం - 40 ఏళ్ల ప్రస్తానంలో రాయలసీమకు చేసింది ఏమీ లేదు

### - చంద్రబాబు తీరుపై వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత విమర్శలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం సిటీ, మే 30 ప్రభాతవార్త**

కడప వేదికగా టిడిపి నిర్వహించిన మహానాడులో జగన్ నామస్మరణ తప్ప వారు ఏం చేశారో.. ఏమి చేయబోతున్నారో.. చెప్పలేక పోయారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. 40 ఏళ్లరాజకీయ జీవితంలో నాలుగు సార్లు ముఖ్యమంత్రి హోదాలో రాయలసీమకు చంద్రబాబునాయుడు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఇన్నేళ్ల రాజకీయ ప్రస్తానంలో గతంలో ఎన్నడూ లేనిరీతిలో తానుకూడా రాయలసీమ వాసినని గుర్తుకు తెచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాయలసీమ వాసిగా గతంలో కేంద్ర ప్రభుత్వం అనంతపురం జిల్లాకు ప్రకటించిన ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళగిరికి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. అదే విధంగా హంద్రీనీవాకు సిఎం హోదాలో భూమి పూజ చేసి ఎందుకు పనులు చేయలేకపో యావన్నారు. వైసిపి హయాంలో రాయలసీమకు మంజూరు చేసిన హై కోర్టును తరలించినప్పుడు రాయలసీమ వాసినని గుర్తుకురాలేదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్టీఆర్ తనను తన కుమారుడిని ఆశీర్వదించినట్లు ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో వీడియో విడుదల చేయించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్టీఆర్ చివరి దశలో చంద్రబాబు గురించి ఏమి మాట్లాడారో మర్చిపోయారా అన్నారు. ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించి ఆయనపై చెప్పులతో దాడిచేయించిపార్టీ నుంచి సస్పెండ్ చేయించిన చంద్రబాబునాయుడు నేడు భౌతికంగా లేరు, ఏం చేసినా, ఏంచెప్పుకున్నా చెల్లుతుందన్న భావనతో ఉన్నారని, ప్రజలకు అన్ని గుర్తు ఉంటాయన్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఇంకా నాలుగేళ్ల సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే తాను ఏమి చేయబోనని పరోక్షంగా చెబుతూ వైకుంఠ పాలిలా తనని మరోసారి అధికారంలోకి రాకుండా చేయవద్దని చంద్రబాబుచెప్పుకోవడం ఆయనలోని భయాన్ని వెల్లడి చేస్తోందన్నారు. అంతేకాకుండా పరోక్షంగా భవిష్యత్తు నాయకుడు నారాలోకేష్ అంటూ కార్యకర్తలకు సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. నారాలోకేష్ సైతం తనకు తాను యువరాజులా భావిస్తూ ఆరుశాసనాలు అనడం, దాన్ని గేమ్ ఛేంజర్ అనడం హాస్యాస్పదమన్నారు. ప్రజా స్వామ్యంలో శాసనాలు ఉండవని గుర్తుంచుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పేరుతో అన్ని వర్గాలను మోసం చేశారని, విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజా హామీలు అమలు చేయకపోవడాన్ని నిరశిస్తూ జూన్ 4న వెన్నుపోటు దినంగా వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతపురం నగరంలో నిర్వహించే కార్యక్రమాలకి ప్రజలు, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నగరాధ్యక్షులు చింత సోమశేఖర్‌రెడ్డి, అనుబంధ సంఘాల జిల్లా, నగర అధ్యక్షులు ఓబిరెడ్డి, సాకే చంద్ర, నరసింహులు, కసిరెడ్డి కేశవరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, కార్పోరేటర్ సంపంగి రామాంజినేయులు, నాయకులు గోగులపుల్లయ్య, గుజ్జల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శంగా నిలిచిన వైఎస్.జగన్‌పాలన

### - వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబునాయుడు - మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**అనంతపురం సిటీ, మే 30 ప్రభాతవార్త**

వైసిపి ఐదేళ్లపాలనలో దేశానికే ఆదర్శంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కొనియాడారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రసంగం హాస్యాస్పదంగా కొనసాగిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఆత్మస్తుతి పరనిందలా చంద్రబాబుతోపాటు టిడిపినేతలు వ్యవహరించారన్నారు. వైసిపి పాలనలో కోవిడ్ వంటి విపత్తు ఎదురైనా ఎన్నికల్లో ఇచ్చిన నవరత్నాల హామీలను అమలు చేసిన ఘనత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దక్కించుకున్నారు. మరోవైపు పోర్టులు, రహదారులు, సచివాలయ భవనాలు, మెడికల్ కళాశాలలు వంటి అభివృద్ధి పనులను సైతం పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. చంద్రబాబు నాయుడుపాలనలో చెప్పుకోవడానికి ఏమీ లేక ఆ పార్టీలోనే 70 శాతంపైగా కార్యకర్తలు విమర్శలు చేస్తుండటంతో టిడిపిపరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందన్నారు. సూపర్‌సిక్స హామీలే అమలు చేయకపోగా, ఆరు శాసనాలు అటూ ప్రకటించారంటూ, ఆరు శాసనాలు కావు అవి టిడిపి మరణ శాసనాలు అన్నారు. డిఎస్సీపై పెట్టిన తొలి సొంతకానికి విలువ లేదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేసి అరాచక పాలనకు తెరలేపారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు చంద్రబాబుకు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో జడ్పిటిసి జూటూరు చంద్ర, యువజన విభాగం సత్యసాయి జిల్లా అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, రాప్తాడు వైస్ ఎంపిపి రామాంజినేయులుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మా ఎంపిటిసిలను జనం గెలిపించారు... ఫండ్స్ పంపిణీలో పక్షపాతం వద్దు

### -గోరంట్ల మండల అభివృద్ధికి మండల పరిషత్‌కు రూ.88 లక్షల నిధులు మంజూరు

### -జనం ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులను అవమాన పరచకండి

### -గోరంట్ల ఎంపిడిఒను ప్రశ్నించిన మాజీమంత్రి ఉషశ్రీచరణ్



ఎంపిడిఒతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

**గోరంట్ల, మే 30 ప్రభాతవార్త**

గోరంట్ల మండల పరిషత్‌లో 22 మంది సభ్యులు వుండగా అందులో ప్రస్తుతం 21 మంది వైసిపి ఎంపిటిసిలే వున్నారని, ఎంపిపి, ఇద్దరు వైస్‌ఎంపిపిలు సైతం వైసిపి వాళ్లేనని అలాంటి తరుణంలో మండల పరిషత్ కింద మంజూరయ్యే నిధులు మా సభ్యులకు ఎందుకు ఇవ్వరని మాజీ మంత్రి, స్థానిక నియోజకవర్గం ఇన్‌చార్జ్, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ గోరంట్ల ఎంపిడిఒను డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయానికి ఆమెతో పాటు ఎంపిపి ప్రమీలమూర్తి, మండల కన్వీనర్ వెంకటేష్, పట్టణ కన్వీనర్, జిల్లా అధికార ప్రతినిధి మేదర శంకర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నార్సింపల్లి రఘురామిరెడ్డి, బాలన్నగారిపల్లి పోతుల రామకృష్ణారెడ్డి, ఎంపిటిసిలు ఓబుల్‌రెడ్డి, సోమశేఖర్, ఉపసర్పంచ్ రాజారెడ్డి, కురుబ సత్యనారాయణ, జొన్న ఆంజనేయులు, సర్పంచు శివానంద, హేమసుందర్‌రెడ్డి, గంగంపల్లి వెంకటరంగారెడ్డి, రాజేంద్రప్రసాద్, రాణా ప్రతాప్‌సింగ్, నీలే రంగారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నరేంద్రకుమార్‌తో ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ గోరంట్ల మండల అభివృద్ధి కోసం మండల పరిషత్‌కు 88 లక్షల వరకు నిధులు మంజూరు అయ్యాయని వాటిని ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంపిటిసిలకు సమానంగా ఇవ్వాలని అలా కాకుండా మంజూరైన నిధులు అధికార పార్టీ వారికి ఏకపక్షంగా పంపిణీ చేస్తే ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అవమానపరిచినట్లు అవుతుందని అది కరెక్ట్ కాదని ఆమె సూచించారు. వైసిపి తరఫున గెలిచిన ఎంపిటిసిలకు మంజూరైన నిధులు కేటాయించినప్పటికీ అవి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుంది తప్ప ఎక్కడ నిధుల దుర్వినియోగం జరగదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాచన్నపల్లి నారప్ప, వానవోలు రాఘవ, సర్పంచు వాసునాయక్, భక్తర్, మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ ఎంపిటిసిలతో కలిసి మండల పరిషత్ వెలుతున్న మాజీ మంత్రి

# ఘనంగా ఉత్తమ ప్రతిభా పురస్కారాలు

### - చదువుతోపాటు సంస్కారం చాలా అవసరం...

### - ఆకుల రాఘవేంద్రను అభినందించిన సిబిఐ మాజీ జెడి లక్ష్మినారాయణ




విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మినారాయణ

**అనంతపురం న్యూటౌన్, మే 30 ప్రభాతవార్త**

నేడు ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏపీఎస్ఎఫ్, ఇన్స్‌ఫైర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు కులాల మతాలకు అతీతంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ సిబిఐ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో చదువుతోపాటు సంస్కారం, వినయం చాలా అవసరం అని అన్నారు. విద్యార్థులకు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులది. విద్యార్థులు బాగా చదివి మన దేశానికి సేవ చేయాలన్నారు. దాదాపు 390 మంది విద్యార్థులకు ఈ ప్రతిభా అవార్డ్స్ అందజేశారు. విద్యార్థులకు శాలువాతో సత్కరించి మెమెంటో పాటు సర్టిఫికెట్ అందజేసి ఒక మొక్కను కూడా బహుకరించారు. ఈ కార్యక్రమంలో సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మినారాయణతో పాటు ఏపీ ఎస్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఏఎస్పి మల్లికార్జున వర్మ, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఎండ్లూరి ప్రభాకర్, సుంకు వేణుగోపాల్, శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ తోట శరత్‌చంద్ర, తేజశ్వర్ రెడ్డి, భవాని రవికుమార్, గిరిధర్, ప్రసాద్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంధ్యామూర్తి శిష్య బృందంచే కూచిపూడి భరతనాట్యం చేయడం జరిగింది. కళాకారుడు తరిమెల రాజు బృందం విద్య గురించి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

# ఘనంగా ధ్వజస్థంభప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

**యల్లనూరు, మే 30 ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ధ్వజస్తంభప్రతిష్ఠ, ప్రాతఃకాలపూజ, దీక్షాహోమము, మూలమంత్ర జపాదులు, వేదపారాయణం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం మూలవిరాట్టు గ్రామోత్సవం, మూలమంత్ర జపాదులు, ఆవాహిత దేవతా హోమాలు, పుష్ప, ధాన్యాధి, శయ్యాధివాసం, ఆదివాస హోమాలు, తదితర పూజా కార్యక్రమాలను వేదపండితులు అర్చకం లక్ష్మీనారాయణప్రసాదుశర్మ, వజ్జల శేషగిరిశర్మలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దంపతులు, ఆయన కుమారుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం యంత్రప్రతిష్ఠ, బింబప్రతిష్ఠ, బింబ ప్రాణప్రతిష్ఠ, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బింబదర్శనము తదితదర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

# నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్, 22ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ, డిఎల్‌సి, డిఎల్ఎస్‌సి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత జాబితాలో వున్న డాటెడ్ ల్యాండ్స్‌ను, 22ఏ భూములను తొలగించేందుకు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో 22ఏకు సంబంధించి 16 క్లెయిమ్స్‌ను విచారించడం జరుగగా డాటెడ్ ల్యాండ్స్‌కు సంబంధించి 31 దరఖాస్తులపై సమావేశం నిర్వహించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించి విచారించి నిబంధనల ప్రకారం అన్ని వివరాలు సక్రమంగా వున్నవి ఆమోదించగా, పూర్తి వివరాలు సరిగా లేనివాటికి సంబంధించి పునః పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఆర్‌బిఎస్‌కె శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహశీల్దార్లు, పాల్గొన్నారు.

# బాలిక చైతన్యంతోనే సమాజభివృద్ధి సాధ్యం సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న

బ్రహ్మసముద్రం మే 30 ప్రభాతవార్త


కిషోర్ బాలికల కార్యక్రమం దృశ్యం

కిశోరి వికాసం, వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా కన్నెపల్లి గ్రామంలో కిశోరి వికాశం కార్యక్రమం సీడీపీఓ ప్రసన్న లక్ష్మిఅధ్యక్షతన నిర్వహించారు సమాజభివృద్ధిలో బాలికలు భాగస్వామ్యం కావాలి అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో కిశోరి బాలికలకు ఆర్థిక అక్షరాస్యత పొదుపును అర్థం చేసుకోవడం పొదుపు చేయడం బాలికలకు యుక్త వయసులో వాళ్ళు వచ్చే సమస్యల నుండి ఎలా పరిస్కారం చేసుకోవాలి వారు భావిస్యత్తు లో వారి లక్ష్యాలను ఏవిధంగా చేరుకోవాలి వంటి అంశాలతో పాటు వారికున్న చట్టాలపై అవగాహన కల్పించారు. డబ్బును అర్థం చేసుకోవడం సురక్షితంగా నిర్వహించడం తెలివిగా ఖర్చు చేయడం భవిష్యత్తు లక్ష్యాలు ఆర్థిక ప్రణాళిక పొదుపు ఎందుకు ఎలావంటి విషయాలపట్ల ఏపిఎం కూలంకషంగా వివరించారు. అనంతరం కన్నెపల్లి గ్రామానికి చెందిన కిశోరి బాలికలు కిశోరి సంఘం ఏర్పాటుకు సిద్ధపడ్డారు ఇది మంచి పరిణామంగా ఏపిఎం తెలియజేశారు.సిడిపిఓ మాట్లాడుతూ డబ్బు లక్ష్యం కాదు దానిని తెలివిగా ఉపయోగించి ఆదా చేయడం వల్ల రేపు చాలా సహాయపడుతుంది తెలివైన అమ్మాయి తమ డబ్బు ఎక్కడికి పోతుందో తెలుసుకోగలుగుతారు. ప్రతి అమ్మాయి తన లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలి సమాజ అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం కావాలంటే కిషోర్ ఈ దశలోనే బాలికలు వారి లక్ష్యం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి. సమాజాభివృద్ధికి ఆటంకాలైనటువంటి బాల్య వివాహాన్ని అరికట్టడానికి అందరూ తమ వంతు ప్రయత్నం చేయాలి ఎక్కడైనా బాల్యవివాహం సమాచారం అందితే 1098 కి సమాచారం అందించాలని తెలియజేశారు అంగన్వాడీ సూపర్వైజర్ రామాంజనమ్మ మండలంలోని బొబ్బర్లపల్లి శాంతినగర్ అంగన్వాడి సెంటర్లలో కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో తిమ్మప్ప సూపర్వైజర్ కాసింబి ఏఎన్ఎం వెలుగు ఆనిమేటర్, అంగన్వాడీ కార్యకర్తలు మహిళ సంరక్షణ కార్యదర్శి జయమ్మ పాల్గొన్నారు.

## బసవరాజు అత్తకు నివాళులర్పించిన వైసీపీ నాయకులు

బ్రహ్మసముద్రం మే 30 ప్రభాతవార్త


నివాళులర్పిస్తున్న దృశ్యం

వైయస్ఆర్సీపీ మాజీ మండల కన్వీనర్ బసవరాజు అత్త కురుబ లక్ష్మీ దేవమ్మ స్వర్గీయులు అయిన విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు వారి స్వగ్రామం బ్రహ్మసముద్రం మండలం గుండి గాని పల్లి గ్రామం నందు వారి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు గంగాధరప్ప బ్రహ్మసముద్రం ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి మాజీ మండల కన్వీనర్ బసవరాజు స్థానిక సర్పంచ్ అశోక్ రెడ్డి కోనాపురం మహాదేవప్ప వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పార్థవదేహానికి నివాళులర్పించి వాళ్ల కుటుంబ సభ్యులను కు వైఎస్ఆర్సిపి ఎప్పుడు మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు

## యోగాసనాలను ట్రైనింగ్ ఇస్తున్న సంగీత శశికళ

బ్రహ్మ సముద్రం మే 30 ప్రభాతవార్త


యోగ శిక్షణ ఇస్తున్న దృశ్యం

మండల కేంద్రం లోనీ మండల పరిషత్ కార్యాలయం నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాచేపట్టిన యోగాంధ్ర మాసం మే 21 నుంచి జూన్ 21 వరకు సంపూర్ణ ఆరోగ్యం కొరకు అందరికీ చేత యోగా చేపించి దాని విశిష్టతను అందరికీ చేరువయ్యేలా కృషి చేయాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోనంద కిషోర్ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ ఆర్ సంగీత శశికళ మరియు వి శశికళ మరియు సిబ్బంది పాల్గొని ఆసనాలుఎలా వేయాలి అని వేసి సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వడంజరిగింది.ఇదేవిధంగాప్రతి రోజు యోగా నిర్వహి స్తూ మీ ఆరోగ్యం పట్ల రోజు శ్రద్ధ వహించాలని అందరికీ తెలియ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నందకిషోర్ ట్రైనర్ సంగీత శశికళ మరియు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత కృషి సంకల్ప అభియాన్ అవగాహన సదస్సు

**కె.వి.కె సమన్వయకర్త శాస్త్రవేత్త చెంద్రాయుడు**

కళ్యాణదుర్గం, మే 30 ప్రభాత వార్త :


రైతులకు సాగులో సూచనలు అందజేస్తున్న కె.వి.కె శాస్త్రవేత్త చెంద్రాయుడు


సదస్సులో పాల్గొన్న వివిధ గ్రామాల రైతులు

వికసిత కృషి సంకల్ప అభియాన్ పథకంలో భాగంగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ పంట సాగులో తీసుకోవలసిన వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధి లోని తిమ్మాపురం, ఓబగానిపల్లి, మల్లాపురం, పాలవాయి, ముదిగల్లు తదితర గ్రామాలలో శాస్త్రవేత్తలు పర్యటించి రైతు సదస్సులు నిర్వహించి ఖరీఫ్ పంట సాగులో అనుసరించాల్సిన పద్ధతులను వివరించినట్లు కేవీకే సమన్వయకర్త చెంద్రాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఖరీఫ్ పంటలు సాగులో అనుసరించాల్సిన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, మట్టి నమూనాల ఆధారంగా పంటల ఎంపిక, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించినట్లు ఆయన వివరించారు. వేరుశెనగ కంది ఆముదం పత్తి ఉద్యానవన పంటల సాగులో సమయానుకూలంగా సస్యరక్షణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి గౌసియాభి, పసుపు పోల్చిన పై వెటర్నరీ అసిస్టెంట్ అరుణ, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, మల్లికార్జున, శిరీష, యుగంధర్ వివిధ పంటల సాగుపై అనుసరించాల్సిన సస్యరక్షణ సాగు పద్ధతులు వివరించారు. సందర్భంగా రైతుల అభిప్రాయాలను సేకరించి ఐసిఏఆర్ నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బాలకృష్ణకు ఎన్టీఆర్ అవార్డు

**సంబరాలు చేసుకున్న టిడిపి నాయకులు**

హిందూపురం మే 30 ప్రభాతవార్త


సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సినీ కథానాయకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు ప్రకటించింది. దీంతో శుక్రవారం హిందూపురం పట్టణంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్, ఎమ్మెల్యే పి,ఎ,లు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలకృష్ణకు అవార్డు రావడం ఆశించేదగ్గ విషయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

## విగ్రహ ఏర్పాటుకు రెండు లక్షల విరాళం

హిందూపురం మే 30 ప్రభాతవార్త


విరాళం అందజేస్తున్న ఆదినారాయణ

హిందూపురం పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ సూగూరు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 45 అడుగుల ఆంజనేయస్వామి ఏకశిలా విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ రెండు లక్షల రూపాయలను విరాళంగా ట్రస్ట్ చైర్మన్ వైసీ చంద్రశేఖర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి పెద్దపీట

**సీసీ రోడ్డు, రక్షణ గోడను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్**


సిసి రోడ్డు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్, ఎమ్మెల్యే పిఏ వీరయ్య, కమిషనర్ తదితరులు.

హిందూపురం టౌన్ మే 30 ప్రభాతవార్త

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో హిందూపురం పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం హిందూపురం మున్సిపల్ పరిధిలోని ఎనిమిదవ వార్డు శ్రీకంఠపురంలో సిసి రోడ్డు, శ్రీకంఠపురం చెరువు వద్ద రక్షణ గోడను మున్సిపల్ చైర్మన్ డి,ఇ రమేష్ కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ పిఏ వీరయ్య, హిందూపురం మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ శ్రీకంఠపురం వద్ద జాతీయ రహదారి నిర్మించడంతో ఆ ప్రాంతం అంతా తగ్గుదలకు గురైందని దీంతో చెరువులో నీళ్ల ఇళ్లల్లోకి వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో హిందూపురం మున్సిపల్ సాధారణ నిధుల నుండి 39.50 లక్షలతో రక్షణ కూడా నిర్మించినట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో శ్రీకంఠపురంలో నూతన సిసి రోడ్లు కాలువలు నిర్మిస్తామని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం


కర్ణాటక మద్యం చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

హిందూపురం టౌన్ మే 30 ప్రభాతవార్త

హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సేవమందిర్ సమీపంలో అక్రమ మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 108 మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మి దుర్గయ్య తెలిపారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న 16 మంది పాత ముద్దాయిలను ఒక్కొక్కరి మీద ఒక్కో సంవత్సరం కాలానికి లక్ష రూపాయల పూచి కత్తు మీద బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు పృథ్వి, ఫరూక్, నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## శుభకార్యంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ


శుభకార్యములో పాల్గొన్న దృశ్యం

అమరాపురం మే 30 ప్రభాతవార్త

మండల పరిధిలోని హేమావతి గ్రామంలో శుభ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మడకశిర తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగాహేమావతి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త సిద్దేష్ ప్రమాదవశాత్తు చేతికి దెబ్బలు తగిలి చికిత్స చేయించుకున్న విషయం తెలుసుకొని సిద్దేష్ ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్సీ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, యువ నాయకుడు అమరాపురంనాగరాజు, టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు గొల్ల మారనపల్లి రామచంద్రప్ప, తిప్పే స్వామి ,నింగేగౌడ, క్లస్టర్ ఇంచార్జ్ కృష్ణమూర్తి, ఎంపిటిసి ఓంకార్ స్వామి, మాజీ సర్పంచ్ కుమార్ స్వామి, మాజీ టెంపుల్ చైర్మన్ జగన్నాథ్ టీచర్ రంగనాథ్ మంజునాథ్ సోదరులు, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ ,మారుతి ప్రసాద్, సుబ్బారెడ్డి ,దాదు,తిప్పజ్జ, మాజీ ఎంపిటిసి శివకుమార్, మీడియా కోఆర్డినేటర్ రవి,నాగరాజు, దయానంద్, పేలుబండ రామన్న ,పాండు,యంజారప్ప,తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందించండి

- జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ


వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

బెలుగుప్ప, మే 30 ప్రభాతవార్త

మండల కేంద్రంలో శ్రీ వినాయక ప్రాసెసింగ్ యూనిట్లో విత్తన వేరుశనక్కాయలను జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ పరిశీలించి రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందించండని తెలిపారు. ఈ యూనిట్లో వేరుశనగ విత్తన కాయల వివరాలను పరిశీలించింది. గ్రామ వ్యవసాయ కేంద్రాలలో వివరాలను కూడా పరిశీలించి రైతులకు ఏ లోటు లేకుండా ప్రతి ఒక్క రైతుకు వేరుశనక్కాలను పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్, టెక్నికల్ వ్యవసాయ అధికారి రాకేష్‌నాయక్, ప్రాసెసింగ్ యూనిట్ అధికారి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీయల్లమ్మతల్లి దేవస్థానం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

గుత్తి, మే 30 ప్రభాతవార్త


యల్లమ్మతల్లి దేవస్థానానికి విరాళం అందచేస్తున్న దృశ్యం

గుత్తి కోట ప్రాంతంలో వెలిసిన శ్రీరేణుక యల్లమ్మ తల్లి దేవస్థానంలో అభివృద్ధి కార్యక్రమాలను నిమిత్తం అనంతపురం లక్ష్మీనగర్కు చెందిన కీర్తిశేషులు వెంకటస్వామి, గిరమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు లక్ష రూపాయలను విరాళంగా అందచేశారు. ఈ మొత్తాన్ని భక్తుల సౌకర్యార్థం అదనపు గదులు నిర్మించేందుకు వినియోగించాలని వారు దేవస్థానం కమిటీని కోరారు. అనంతరం ఆలయ అర్చకులు వారి చేత ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకొని ఇతరులకు ఆదర్శంగా ఉండాలి

-జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు

గుత్తి, మే 30 ప్రభాతవార్త



వైస్ ఛాన్సలర్ మాట్లాడుతున్న దృశ్యం

వట్టభద్రులైన విద్యార్థులు తమకు ఆసక్తి వున్న రంగాలను ఎంచుకొని రాణించాలని జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు నాచించారు. స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి అవసరమైన పరిశోధనలు చేసి, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తద్వారా ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంబిఏ, ఎంసిఏ పూర్తి చేసిన తొలి బ్యాచ్ విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకున్నారు. టాపర్లుగా నిలిచిన ఆరిఫాబేగం, షేక్ రేష్మాలకు గోల్డ్ మెడల్స్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వైశాలి గోర్పడే, ఎండి రఘునాథరెడ్డి, కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఇంతియాజ్, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఏకీకృత పంటల సాగుకు స్వస్తి.... వైవిధ్యతపై రైతులకు అవగాహన


ఏడిఏ వెంకటరాముడు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, మే 30 ప్రభాతవార్త

నూతన సాంకేతికత, శాస్త్రీయ బృందాల అవగాహనతో రైతులు అవలంభించాల్సిన పంటల సాగు పట్ల రైతులు అవగాహన పెంపొందించుకోవాలని గుత్తి ఏడిఏ వెంకటరాముడు సూచించారు. మండలంలోని తొండపాడు, వన్నెదొడ్డి గ్రామాల్లో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం మేరకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల పిచికారి, డ్రోన్ స్ప్రేయింగ్, భూసార పరీక్షలు, శాస్త్రీయంగా ఎరువుల వినియోగం, తదితర ముఖ్య అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముస్తాక్‌అహ్మద్, శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మన్న, రమణ, సుధారాణి, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## రక్షణ సువార్త మహాసభను జయప్రదం చేయండి

కళ్యాణదుర్గం, మే 30 ప్రభాతవార్త :

ముఖ్య ప్రసంగికురాలుగా హిజ్రా సిస్టర్ "అంజలి " కళ్యాణదుర్గం పట్టణం బళ్లారి బైపాస్ లోని బేరయ ప్రార్థన మందిరంలో జరుగుచున్న "రక్షణ సువార్త మహాసభ ను జయప్రదం చేయాలని పలువురు పాస్టర్లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక సి ఐ అండ్ జి చర్చిలో అధ్యక్షులు రాజశేఖర్ చౌదరి ఆధ్వర్యంలో రక్షణ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రసంగికురాలుగా సిస్టర్ హిజ్రా అంజలి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ రెవరెండ్ రవిప్రసాద్, ఇసయ్య, పెనుయేలు ఇసయ్య, నిర్వాహకులు స్వరూప్ కుమార్, చల్లా కిషోర్ చౌదరి, బిషప్ జాన్సన్ బాబు,రోజ్లీ రాజేష్, అర్థర్ బాబు, జోసెఫ్ కిశోర్, రవి కుమార్, సునీల్, పాస్టర్స్ డి, ఎన్ పాల్, బసవరాజు, జేమ్స్ నాయక్,రూబెన్,ఇస్సాకు, ఓబధ్య, విజయ్ కుమార్, బాలు, సువార్త బృందం సెలిన చౌదరి, ప్రెస్కిలా, పెనుకొండ క్రిష్టఫర్,తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

# నేడు గొట్కూరుకు మంత్రి పయ్యావుల కేశవ్

-ఎన్టీఆర్ భరోసా పించన్లు పంపిణీ చేయనున్న మంత్రి


రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 30 ప్రభాతవార్త

రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం గొట్కూరు గ్రామంలో పర్యటిస్తారని సమాచార పౌర సంబంధాలశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం ఆయన గ్రామానికి చేరుకొని ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్దిదారులకు పంపిణీ చేస్తారని పేర్కొంది.

## కూలీలందరూ ప్రమాద బీమా చేయించుకోవాలి

- మోపిడిలో ఉపాధి పనుల తనిఖీలో ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్


మోపిడి గ్రామంలో కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

ఉరవకొండ, మే 30 ప్రభాతవార్త

ఉపాధిహామీ కూలీలందరూ తప్పనిసరిగా ప్రమాద బీమా చేయించుకోవాలని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని మోపిడి గ్రామంలో హంద్రీనీవా పిల్ల కాలువలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పూడికతీత పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలు రోజువారి కూలీ 306 రూపాయలు వచ్చేలా పనులు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా, జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విమల, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ధర్మవరంలోని సర్వేనెంబర్ 650లో అవినీతి, అక్రమాలపై నిగ్గుతేల్చాలి...!

**జాయింట్ కలెక్టర్ ని కలిసిన సీపీఐ, ఫ్లంబర్స్ కార్మికులు...!**

ధర్మవరం, మే 30(ప్రభాతవార్త)


జేసీని కలిసిన సీపీఐ, ఫ్లంబర్స్ అసోషియేషన్ నాయకులు

ధర్మవరంలోని 650.2 సర్వేనెంబరులో అవినీతి అక్రమాలపై విచారించి దొంగపట్టాలను రద్దుచేసి అర్హులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిమునుగుమధు, ఫ్లంబర్అసోషియేషన్ నాయకులు జాయింట్కలెక్టర్ అభిషేక్ కుమార్కు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక కుమార్ మార్కెట్యాభద్రపరచిన ఈవీఎం, వీవీప్యాట్లను పరిశీలను విచ్చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ, ఫ్లంబర్స్ అసోషియేషన్ నాయకులు అక్కడికి వెళ్లి 650.2లో సమస్యను విన్నవించారు. గత పది రోజులుగా 650.2లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారన జరిపి అర్హులకు న్యాయం చేయాలని రిలేదీక్షలు చేస్తున్న రెవిన్యూ అధికారులు దీక్షల వద్దకు వచ్చి సమస్యలు అడగకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారని జేసీకి విన్నవించారు.650.2లో పట్టాలన్నీ రద్దు చేసి అర్హులైన వారికే పట్టాలు ఇవ్వాలని జేసీని కోరారు. అనంతరం జేసీ ఆదేశాల మేరకు తహసీల్దార్ సీపీఐ, ఫ్లంబర్స్ అసోషియేషన్ నాయకులను పిలిపించుకుని చర్చించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టిరమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, చేనేత కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గుర్రం వెం కటస్వామి, ఫ్లంబర్స్ అసోషియేషన్ అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, తాజుద్దీన్, మసూద్, రామకృ ష్ణ. రామసుబ్బయ్య, వేణుగోపాల్, నాగేంద్ర, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి రైతులు సహకరించాలి

-పిల్ల కాలువల పూర్తికి స్వచ్ఛందంగా భూములు ఇవ్వాలి

-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్

గుంతకల్లు, మే 30 ప్రభాతవార్త

రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుండి పిల్ల కాలువల పూర్తికి రైతులు సహకరించి స్వచ్ఛందంగా భూములు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు గ్రామాల రైతు సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. పిల్ల కాలువల పూర్తికి ప్రభుత్వం దాదాపు 215 ఎకరాల భూమి సేకరించాల్సి వుందన్నారు. భూసేకరణ పనులు మొదలుపెట్టినా కొంతమంది రైతులు సహకరించకపోవడంతో వాయిదాలు పడుతూ వస్తోందన్నారు. కాలువలు పూర్తి అయితే మండలంలోని 12 చెరువులతో పాటు, 150 చెక్ డ్యాములు, బోర్లకు పుష్కలంగా నీరు అందుతుందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం మార్కెట్ విలువ ప్రకారం సకాలంలో నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రధానంగా ప్రభుత్వం రైతాంగాన్ని దృష్టిలో వుంచుకొని కాలువలను సకాలంలో పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు జయన్న, శ్రీనివాసులు, పెన్నయ్య, బాలకృష్ణ, రామాంజనేయులు, నాగేంద్ర, సిపిఐ నాయకులు గోవిందు, నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంజెపి బాలికల గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**గుడిబండ మే 30 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎంజెపి బాలికల గురుకుల కళాశాలలో 202526 విద్యాసంవత్సరానికి సంబంధించి శుక్రవారం అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 4వ తేదీన జరిగిన ఎంజెపి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎంపికైన 55మంది విద్యార్థులకు గాను 19మంది విద్యార్థులు కళాశాలలో దరఖాస్తులు అందించి అడ్మిషన్లు పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు శివలింగప్ప, అర్చన,శీను,రాధ బోధనేతర సిబ్బంది అశోక్ కుమార్, రవికుమార్,భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులు ఆపాలి

### - ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చెరుకూరు గంగులయ్య

తనకల్లు, మే 30 ప్రభాతవార్త

దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులు ఆపాలని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చెరుకూరు గంగులయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, మైనార్టీలపైన దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని ఆపాల న్నారు. అదేవిధంగా నడిరోడ్డుపై బహిరంగంగా విచక్షణా రహితంగా కొట్టడం చాలా దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా ఎస్‌సి, ఎస్‌టి, మైనారి టీలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్ప డానికి గుంటూరు జిల్లా తెనాలిలో ఐతానగర్‌లో జరిగిన సంఘటన నిదర్శ నమన్నారు.

అదేవిధంగా డిప్యూటి సిఎం నియోజకవర్గం పిఠాపురంలోని మల్లం గ్రామంలో ఏకంగా దళిత కుటుంబాలను గ్రామం నుండి వెలివేసిన సంఘటనలు. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా కొట్టడం ఇంకొక సిఐ బూట్ కాలుతో తొక్కడం ఈ విధంగా థర్డ్ డిగ్రీ ఉపయోగించడం హక్కుల ఉల్లంఘనేనన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ముగ్గురిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఒకవేళ తప్పు చేసి వుంటే ఎఫ్ఐఆర్ కట్టి రిమాండ్ పంపి కోర్టుకు పంపాలేగాని ఇలా చేయడం మీకు హక్కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర హోంశా ఖా మంత్రి స్పందించి వారిని సస్పెండ్‌చెయాలన్నారు. రా ష్ట్రంలో వున్న ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు, కుల సం ఘా లు, విద్యార్థి సంఘాలు, మహి ళా సంఘాలను కలుపుకొని జాతీ య మానవహక్కుల పరిరక్షణ సంస్థను కలిసి వారి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాంప్రసాద్‌నాయక్, బసెట్టి రవీంద్ర పాల్గొన్నారు.

## మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీకి ఎంఎల్ఏ పల్లె సింధూరరెడ్డి రూ.10 లక్షల విరాళం

### - ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కు అందజేత

అమడగూరు, మే 30 ప్రభాతవార్త

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలుగుదేశం పార్టీకి తన వంతు విరాళంగా 10 లక్షల రూపాయల చెక్కును పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందచేశారు. కడపలో జరిగిన రాష్ట్ర మహానాడు వేదిక సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పార్టీకి 10 లక్షల రూపాయలను విరాళంగా ప్రకటించి అందుకు సంబంధించిన చెక్కును పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు అందచేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

## నాటుసారా తయారీ దారులపై ప్రత్యేక నిఘా ఉంచండి

### - ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డిసి జయరాజ్

కదిరి, మే 30 ప్రభాతవార్త

నాటుసారా తయారీ దారులపై ప్రత్యేక నిఘా ఉంచి అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ జయరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను డిప్యూటీ కమిషనర్, జిల్లా ఎక్సైజ్ అధికారితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాత కేసుల పురోగతిపై సిఐ రామ్మోహన్‌కు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవోదయం 2.0కార్యక్రమంలోభాగంగా నాటుసారా తయారీ దారులపైన నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నాటుసారా తయారీ, విక్రయించడం, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కదిరి ఎక్సైజ్ స్టేషన్ ఫరిధిలో కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచిం చారు. నాటు సారా తయారీకి పదేపదే సహకరిస్తున్న వ్యక్తు లపై పిడి యాక్టు నమోదు చేయాలని అధికారులను ఆదేశిం చారు. సెప్టెంబర్ 30వ తేది లోగా ఎక్సైజ్ స్టేషన్ ఫరిధిలోని అన్ని గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, కార్యక ర్తలు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ జయరాజ్

## విద్యుదాఘాతంతో మృతి చెందిన రాజకుల్లాయప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

పుట్లూరు, మే 30 ప్రభాతవార్త

మండలంలోని చాలవేముల గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన రైతు టి.రాజకుల్లాయప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీటి రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం రాజకుల్లాయప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వీటి రామాంజనేయులు మాట్లాడుతూ రాజకుల్లాయప్ప కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. వ్యవసాయ పొలాల వద్ద రైతులు విద్యుదాఘాతానికి గురికాకుండా ట్రాన్స్‌కో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పుట్లూరు మండల గౌరవాధ్యక్షులు బి.చిన్నకృష్ణుడుయాదవ్, రైతులు శ్రీనివాస్, సూర్యనారాయణరెడ్డి, ఆంజనేయులు, కుళ్ళాయిరెడ్డి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**రాజకుల్లాయప్ప కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి : సిపిఎం**

విద్యుదాఘాతంతో మృతి చెందిన రాజకుల్లాయప్ప కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని సిపిఎం పార్టీ మండల కార్య దర్శి సూరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లా డు తూ రాజకుల్లాయప్ప తోట పని బేల్దారి పని చేసు కుం టూ జీవనం సాగించేవాడన్నారు. కుటుం బాన్ని పోషి స్తున్న కొడుకు చనిపో వడం తో కుటుంబం దిక్కు లేని పరిస్థితుల్లో వుందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభు త్వం ఆ కుటుంబానికి న్యా యం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘ కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి టి.పెద్దయ్య, కెవిపిఎస్ నాగభూషణ్, బి.భాస్క ర్‌రెడ్డి, జె.పెద్దయ్య తదిత రులు పాల్గొని ఆ కుటు ంబాన్ని పరామర్శించారు.



రాజకుల్లాయప్ప భౌతికదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## ఇనగలూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అంజి

ఓబుళదేవరచెరువు, మే 30, ప్రభాతవార్త : ఓడిసి మండలం ఇనగలూరు గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షుడిగా రామిరెడ్డిపల్లికి చెందిన అంజి (మంక ముతక ఆంజనేయలు) ఎంపికయ్యారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిల ఆదశాల మేరకు కన్వీనర్ జయచంద్ర, జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి ఇనగలూరు పంచాయితీ నాయకుల సమక్షంలో శుక్రవారం గ్రామ కమిటీ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి, కోశాధికారిగా ప్రభాకర్, కార్యనిర్వా హక కార్యదర్శిగా లక్ష్మీపతి, ఆంజనేయులు, భాస్కర్, శ్రీరాములు, తిరుపాల్ నాయక్, మల్లికార్జునతదతరులకు కార్యవర్గంలో చోటు కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు టిడిపి కైవసం చేసుకునేలా పనిచేస్తామన్నారు. పంచాయితీలోని నాయకులు, కార్యకర్తల సహకారంతో పనిచేస్తామన్నారు. మా ఎంపికకు సహకరించిన నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు.



అంజి

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



సిఐటియు నాయకులు

ఓబుళదేవరచెరువు, మే 30, ప్రభాతవార్త : మండల కేంద్రంలో వాటర్ ట్యాంక్ వద్ద సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సిఐటియు నాయ కులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నా రు. జిల్లా కార్యదర్శి లక్ష్మినారా యణ, సీనియర్ నాయకులు వివి రమణ, మండల కార్యదర్శి కుల్లాయ ప్పలు జెం డా ఎగురువేసి ఉద్యమ వందనాలు సమ ర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ...కార్మిక సమస్యల పరిష్కా రం కోసం 1970 మే 30వ తారీఖున సిఐటియు ఆవిర్భవించిందన్నారు. సమానపని సమాన వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిం చాలని, గ్రాడ్యుటి, ప్రమాద బీమా, రాజకీయ వేదింపులు, లేబర్‌కోడ్ రద్దు తదితర అంశాల పరిష్కారమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కార్మికులకు అనునిత్యం అండగా ఉంటూ వారి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కదిరి, మే 30 ప్రభాతవార్త

సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని సిఐటియు కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్.నరసింహులు కార్యాలయం వద్ద సిఐటియు నాయకులతో కలిసి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970 మే 30వ తేదిన సిఐటియు ఏర్పడిం దన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్మికుల సమస్యలపైనే నిరం తరం పోరాడుతోందన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్నటువంటి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చింద న్నారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుపాల్, లక్ష్మన్న, సిఐటియు నాయకులు ముస్తక్, జగన్‌మోహన్, బాబ్‌జాన్, రామాంజినేయులు, రఫి, సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌లు పాల్గొన్నారు.

## రైతులు యాజమాన్యపద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యం

పుట్లూరు, మే 30 ప్రభాతవార్త

రైతులు యాజమాన్యపద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్తలు తెలియచేశారు. శుక్రవారం మండలంలోని శనగలగూడూరులో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చీని, నిమ్మ, దానిమ్మ, అరటి పంటల యాజమాన్యం, వాటిలో వచ్చే చీడ పీడలు వాటి సస్యరక్షణ గురించి తెలిపారు. రేకులకుంట సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న మాట్లాడుతూ వేరుశనగ, పప్పుశనగ, కంది తదితర పంటల్లో వచ్చే చీడ పీడలు, వాటి సస్యరక్షణ గురించి రైతులకు తెలియచేశారు. కెవికె రెడ్డిపల్లి బి.చందన మాట్లాడుతూ కెవికె అందిస్తున్న సేవలు, విత్తనాల లభ్యత, డ్రోన్ ద్వారా పిచికారి తదితర అంశా లను తెలియచేశారు. మండల వ్యవసాయాధికారి కాత్యాయిని మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని రైతులకు సూచించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఇంకా ఎవరైనా పెండింగ్ వుంటే త్వరగా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజన్న, ఎస్ఎంఎస్ చందన, ఆత్మ ఏటిఎం హిమబిందు, మండల వ్యవసాయాధికారి కాత్యాయిని, ఏఇఒ హరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఒ కాత్యాయిని

## అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ

పెద్దవడుగూరు, మే 30 ప్రభాతవార్త

మండలంలోని వీరన్నపల్లి గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న రవి అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి మద్యం విక్రయిస్తున్న రవిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఘనంగా బిజెపి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రతాప్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, మే 30 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పివి ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తాడిపత్రి నియోజకవర్గం కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, వాణిజ్యాసెల్ జిల్లా కన్వీనర్ శేషఫణి, మైదుకూరు ఆంజనేయులు, బాలకంబగిరి, చెన్న రంగనాయకులు, రామచంద్రారెడ్డి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఛలో వరంగల్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ జిల్లా నాయకులు

కదిరి, మే 30 ప్రభాతవార్త

నేడు (శనివారం న) ఢిల్లీ నుంచి వరంగల్‌కు విచ్చేయను న్న పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకడానికి పెద్ద ఎత్తున తరలి రావాలని ఎంఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర నాథ్ పిలుపునిచ్చారు. శుక్రవా రం ఎంఈఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. పద్మశ్రీ పురస్కారాన్ని భారత రాష్ట్రపతి చేతులు మీదుగా అందుకుని నేడు(శనివారం) వరంగల్ నగరానికి విచ్చేయనున్న మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకడానికి సత్య సాయి జిల్లా వ్యాప్తం గా ఎమ్మార్పిఎస్, అనుబంధ సంఘాల శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వేమయ్య, ఆంజినేయులు, గంగన్న, పవన్, మురళీలు పాల్గొన్నారు.

## వీర జవాన్ మురళీనాయక్ స్మారక క్రికెట్ పోటీ ప్రారంభం



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న కోచ్

కదిరి, మే 30 ప్రభాతవార్త

పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో వేసవి క్రికెట్ శిక్షణ క్రీడాకారులకు ఆర్డిటి జిల్లా క్రికె ట్ సంఘం ఆధ్వర్యంలో వీరజ వాన్ మురళీనాయక్ స్మారక క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రార ంభమయ్యాయి. మొత్తం క్రీడాకారులను ఆరు జట్లుగా ఎంపిక చేసి, మొదటి బ్యాచ్‌లో కదిరి వారి యర్స్ జట్టు, కదిరి సూపర్ కింగ్స్ జట్టుపై విజయం సాధించారు. వారి యర్స్ సారధి అర్థసెంచరీ(53) చేయగా, గోవర్ధన్ 5 వికెట్లతో రాణించారు. మరోమ్యాచ్‌లో కదిరి లిటిల్ స్టా ర్స్, నైట్‌రైడర్స్ మ్యాచ్ వర్షం కారణంగా ఒక ఇన్నింగ్స్ మాత్రమే సాధ్య మైంది. కార్యక్రమంలో మండల క్రికెట్ సంఘం సభ్యులు ఎల్లప్ప, ముభా రక్, సీనియర్ క్రీడాకారులు రేవంత్, సాయి, ప్రశాంత్, సాధిక్, వెంకట సాయిలు పాల్గొన్నారు. అంతకంటే ముందు క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అమర జవాన్‌కి శ్రద్ధాంజలి ఘటించారు.

## ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి

### - ఎంపిడిఒ వాసుదేవరెడ్డి



యోగా చేస్తున్న అధికారులు, సిబ్బంది

యల్లనూరు, మే 30 ప్రభాతవార్త

ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలంటే యోగా తప్పనిసరి అని ఎంపిడిఒ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శుక్రవారం యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వాసుదేవరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు సలీం, హర్షవర్ధన్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ గిరి, సిబ్బంది పాల్గొని యోగా చేశారు.

## నాణ్యతలేని వేరుశనగ విత్తన కాయలను వెనక్కు పంపిన వ్యవసాయాధికారి



వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

తనకల్లు, మే 30 ప్రభాతవార్త

తనకల్లు మండలానికి వచ్చిన నాణ్యతలేని వేరుశనగ విత్తన కాయలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ వెనక్కు పంపారు. బాలసముద్రం గ్రామానికి వచ్చిన 1020 క్వింటాళ్ల వేరుశనగ కాయలను పరిశీలించి నాణ్యతలేకపోవడంతో వాటిని వెనక్కు పంపారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు కదిరి-6 రకం నాణ్యమైన వేరుశనగ కాయలు మండలానికి వచ్చేలా చూడాలని వ్యవసాయాధికారి శ్రీహరినాయక్‌ను కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## CLASSIFIED

### సర్టిఫికెట్లు దొరికిన వారు ఆచూకీ తెలుపగలరు

పుట్లూరు మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన పుట్లూరు సమిత అనే విద్యార్థినికి చెందిన 10వతరగతి మార్కుల జాబితా పోవడం జరిగింది. చింతకుంట గ్రామం నుండి పుట్లూరుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎక్కడో పడిపోయాయి. దొరికిన వారు పుట్లూరు పోలీస్ స్టేషన్ నందు కానీ,విద్యార్థిని సెల్‌నెంబర్; 9000179004, 7013400588కు కాల్‌చేసి తెలుపగలరు.

# స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఖాళీలు పెంచాలని 2వ రోజు ధర్నా


నిరసన వ్యక్తం చేస్తున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయులు

అనంతపురం న్యూటౌన్, మే 30 ప్రభాతవార్త
ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ పదోన్నతులపై గౌరవ హైకోర్టులో వేసిన కేసు పరిష్కారం కావడంతో 2023 జనవరి 26 నుండి ఏప్రిల్ 30 వరకు 3 నెలల పైగా రూ.2500 గౌరవ వేతనంతో తాత్కాలిక పద్ధతిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ టీచర్స్‌గా పనిచేసిన సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు ఇంగ్లీష్ టీచర్స్ పదోన్నతులు ఇవ్వాలని అనంతపురం డిఈఓని కలవగా కేవలం 19 ఖాళీలు మాత్రమే ఉన్నాయని చెప్పడంపై ఆందోళన చెందిన ఉపాధ్యాయులు 2023లో తాత్కాలిక పద్ధతిలో ఇచ్చిన 230 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ పదోన్నతుల ఖాళీలను తేల్చాలని అనంతపుంలోని శారద నగరపాలక బాలికోన్నత పాఠశాలలో రెండవ రోజున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్సీకి 30 కోటాకు గాను103 పోస్టులు కేటాయించి పదోన్నతులకు 70 శాతం కోటా కింద ఇవ్వాల్సిన పదోన్నతులు కేవలం 19 మాత్రమే ఇస్తామనడం తీవ్రమైన అన్యాయమని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులను సంప్రదించి ఖాళీల సంఖ్యను కచ్చితంగా పెంచాలని లేని పక్షంలో ధర్నాను కొనసాగిస్తామని ఈ సందర్భంగా సీనియర్ సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పదోన్నతుల జాబితాలోని ఉపాధ్యాయులు జి. సూర్యుడు, చంద్రశేఖర్, నాగభూషణ, జయరాం నాయక్, జయపాల్ నాయుడు, సురేష్, నరసింహులు, మురళి, భాస్కర నాయుడు, రవి,మహిళ ఉపాధ్యాయినీలు విజయశ్రీ, పరిమళ, తులసి, మాధవి, ఆదిలక్ష్మి, కౌసర్‌బాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు నాగేంద్ర పిఆర్‌టియు నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఇఎఫ్ నాయకులు నారాయణనాయక్, జయరాం నాయక్, వైయఆర్‌టియఫ్ నాయకులు నాగిరెడ్డి, శ్రీనివాసులు, రవినాయక్, నాగభూషణ ప్రసంగించారు.

# చెత్త సేకరణపై సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశాం
## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


పాల్గొన్న అధికారులు

అనంతపురం కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త
ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించే విషయంపై సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి యోగాంధ్ర-2025 క్యాంపెయిన్, పిఎం సూర్య ఘర్, సానుకూల ప్రజా అవగాహన తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. సిఎస్ విసిలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించే విషయంపై సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ అంశంలో డిపిఓ, మున్సిపల్ కమీషనర్లతో ప్రత్యేకంగా సమీక్షించామని రెండు వారాల నుండి ప్రత్యేక డ్రైవ్‌ను కూడా చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ ఏ.మలోల, మున్సిపల్ కమీషనర్ బాలస్వామి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబి.దేవి, టూరిజం అధికారి జయకుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయం ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు - రామచంద్ర, ఎల్లన్న, జీవీ ఉజ్వల్


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మే 30 ప్రభాతవార్త
సచివాలయం ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎల్లన్న, రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జీవీ ఉజ్వల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్‌ని కలిసి వివరించారు. నాలుగు జిల్లాల పరిధిలో (అనంతపూర్, కర్నూల్, కడప, చిత్తూర్) పనిచేస్తున్న సచివాలయం ఉద్యోగుల సమస్యల మీద మాట్లాడారు. సర్వేలు పేరుతో తీవ్ర వేధింపుల వల్ల ఉద్యోగులు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి. శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు ప్రభుత్వం కల్పించిన రెస్ట్ అవర్స్‌లో కూడా హౌస్ సర్వేలు, ప్లాస్టిక్ రైడింగ్‌లు, ఆఫీస్ మీటింగ్‌లు, టెలికాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు, పేరుతో రోజుకు 12 గంటలు బలవంతంగా, బెదిరించి పని చేయించడం వల్ల గత 4 నెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలకు అవుతున్నారు. మహిళ ఉద్యోగులు నరక యాతన పడుతున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి తిప్పేస్వామి, మైనార్టీ సెల్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వర్గ కష్టాలు తీర్చేది సిఐటియు జెండానే
## - జులై 9వ తేదీ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె దేశ భవిష్యత్తు కోసం
## - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్


సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యాలు


సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యాలు

అనంతపురం, మే 30 ప్రభాతవార్తబ్యూరో
దేశంలో అన్ని వర్గాల కార్మికుల సమస్యలు పై పోరాటం చేసి వారి కష్టాలు తీర్చేది సిఐటియు జెండానే అని, శుక్రవారం నిర్వహించిన 55వ ఆవిర్భావ దినోత్సవం జెండా ఆవిష్కరణ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో గనే నాయక్ భవన్ సిఐటియు జిల్లా కార్యాలయం ముందు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఐటియు 1970లో ఆవిర్భవించిందని నాటి నుంచి నేటి వరకు అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తూ, కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా ఉంటూ పదుల సంఖ్యలో కార్మిక చట్టాలు సాధించుకుని కార్మికులకు రక్షణ కవచంగా సిఐటియు నిలిచిందని అన్నారు,
భారతదేశ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికుల కనీస వేతనం కోసం, కార్మిక హక్కుల కోసం, వారి రక్షణ కోసం, నిత్యం కార్మికులతో మమేకమవుతూ, ఐక్యం చేస్తూ, పోరాటాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. మే నెల అంటేనే కార్మికుల నెలగా కార్మికులంతా గుర్తుపెట్టుకోవాలని మే మొదటి తారీకు ఎర్రజెండా పుడితే భారతదేశంలో మే 30 తేదీన సిఐటియు ఆవిర్భవించింది అన్నారు. కార్మికులలో కుల, మత ప్రాంత భేదాలు లేకుండా దేశ సమైక్యతను నింపుతూ, కార్మిక వర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా, కార్మిక వర్గ కష్టాల విముక్తి ధ్యేయంగా సిఐటియు పోరాటాలు చేస్తోందని ఆయన కొనియాడారు. బ్రిటీష్ హయాం నుండి 44 రకాల కార్మిక చట్టాలు పోరాడే సాధించుకుందన్నారు. నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని ఇవి కార్మికులకు ఉరితాడుగా మారినాయని వాపోయారు. దేశ భవిష్యత్తు కోసం నాలుగు కార్మిక కోడ్స్ రద్దు, 29 కార్మిక చట్టాల అమలుకై జులై 9వ తేదీ దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులందరికీ సిఐటియు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి. నాయుడు జిల్లా కార్యదర్శి రమాదేవి, నగర కార్యదర్శులు వెంకట్ నారాయణ ముత్తుజ, మునిసిపల్, సివిల్ సప్లై, జనరల్ హమాలీలు, అంగన్వాడి, భగత్ సింగ్ ఆటో వర్కర్స్ యూనియన్, మెడికల్ రిప్రజెంటీవ్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, ఆజాం బాషా, ఆదినారాయణ, సురేంద్ర, శ్రీనివాసరావు కార్మికులు పాల్గొన్నారు.

# సబ్సీడి విత్తన వేరుశెనగ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోండి
## - రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
## - మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర వెల్లడి


మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర.

పామిడి, మే 30 ప్రభాతవార్త
2025 ఖరీఫ్ సీజన్ వేరుశెనగ పంటను సాగు చేస్తే రైతులు ప్రభుత్వం 40 శాతం సబ్సీడితో అందిస్తున్న విత్తన వేరుశెనగ కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర పిలుపునిచ్చారు. మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో విత్తన వేరుశెనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర శుక్రవారం 'ప్రభాతవార్త' ద్వార రైతులకు తెలియజేశారు. మండలానికి 1100 క్వింటాళ్ళ కే-6, 100 క్వింటాళ్ళ టిసిజిఎస్-1694 అనే రకాలు మొత్తం 1200 క్వింటాళ్ళ వేరుశెనగ విత్తన కాయలను కేటాయించటం జరిగిందన్నారు. వేరుశెనగ పంటను సాగు చేయాలనుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డ్, మొబైల్‌ఫోన్ తీసుకెళ్ళి రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఎకరంలోపు ఉన్నటువంటి రైతులకు 1 బస్తా (30 కేజీలు), 1.0 ఉన్నవారికి 2 బస్తాలు (60 కేజీలు), 1.0 ఆపైన ఉన్నవారికి 3 బస్తాలు (90 కేజీలు) ఇస్తారని 30 కేజీల 1 బస్తా ధర రూ.2790 ప్రభుత్వ రాయితీ రూ.1116 కాగా రైతులు రూ.1674 చెల్లించాలని, 60 కేజీల 2 బస్తాల ధర రూ. 5580 ప్రభుత్వ రాయితీ 2232 కాగా రైతులు రూ.3348 చెల్లించాలని, 90 కేజీల 3 బస్తాల ధర రూ. 8379 ప్రభుత్వ రాయితీ రూ. 3348 కాగా రైతులు 5022 చెల్లించాలని మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర వెల్లడించారు.

# ప్రతి ఇంటికి డోర్ నెంబర్ తప్పనిసరి
## - లేకుంటే వారి ఓటు గల్లంతు


డోర్ నెంబర్ లేని ఆధార్ కార్డు

శింగనమల, మే 30 ప్రభాతవార్త
నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఇంటికి డోర్ నెంబర్ తప్పని సరిగా ఉండాలి. లేకుంటే డోర్ నెంబర్‌లేని ఇంటి ఓట్లు గల్లంతు అవుతున్నాయి. డోర్ నెంబర్‌లేని ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఓటరు కార్డులో గతంలో అధికారులు 00 నెంబర్‌తో కేటాయించడంతో ప్రస్తుతం ఎన్నికల నియమావాలి మేరకు 00 ఇంటి నెంబర్ ఉన్న ఓట్లు తీసివేస్తున్నట్లు సమాచారం తెలిసింది. ఇప్పటికైనా మండల వ్యాప్తంగా గ్రామ పంచాయితీ అధికారులు, బిఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఇంటికి డోర్ నెంబర్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఇంటికి డోర్ నెంబర్ కచ్చితంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కొందరి ఓట్లు గల్లంతైనట్లు ప్రజలు గుర్తించారు. శుక్రవారం కొందరు స్థానిక ఎన్నికల అధికారిని కలిసి ఓటరు లిస్ట్‌లో తమ ఓటు లేకపోవడాన్ని గమనించి ఎన్నికల అధికారిని ప్రశ్నించడంతో వారు ఆధార్ కార్డు, ఓటరు, రేషన్‌కార్డులో ఇంటి నెంబర్ లేకపోవడాన్ని గమనించి కచ్చితంగా ఇంటి నెంబర్‌లేని వారికి ఓటు ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటరు కార్డులో డోర్ నెంబర్ నమోదు చేయించుకోవాలని వారు తెలిపారు.

# నేడు పింఛన్‌లు పంపిణీ - ఎంపిడిఓ భాస్కర్


ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, మే 30 ప్రభాతవార్త
జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నేడు (శనివారం) పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ దారుల ఇంటి వద్దనే పింఛన్‌ను అందజేస్తారని, జూన్ 1వ తేదిన ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పంపిణీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా 6,274 మంది పింఛన్ దారుల కు రూ.2,88,66,000 నగదు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు లబ్దిదారులందరికీ పింఛన్ పంపిణీ చేస్తారని, సాంకేతిక కారణాలు తలెత్తితే రెండోరోజు ఆదివారం అందిస్తారని, మూడవ రోజు సోమవారం ఆయా గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ పూర్తి చేస్తారని ఆయన తెలిపారు.

# పింఛన్ల పంపిణీలో నాయకులందరూ పాల్గొనండి
## - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, మే 30 ప్రభాతవార్త
నియోజకవర్గ వ్యాప్తంగా నేడు (శనివారం) ఎన్టీఆర్ భరోసా పింఛన్ పింపిణీలో భాగంగా టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనాలని మండలాధ్యక్షులు, డివిజన్ వార్డు అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్, బూత్ సెక్షన్ ఇన్‌చార్జ్‌లు, ఇతర పదవులలో ఉన్న నాయకులు ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు.

# కలెక్టర్ ఆదేశాల మేరకు సుఖ్ దేవ్ నగర్ నుంచి నడిమి వంక వరకు పూడికతీ చేపట్టాం
## - గ్రేడ్ I పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బాబు.


కాలువలో పూడిక తీస్తున్న పనులను పరిశీలిస్తున్న అధికారులు.

అనంతపురం రూరల్,మే 30 ప్రభాతవార్త :
అనంత రూరల్ మండలం ఏ. నారాయణపురం పంచాయతీ పరిధిలోని సుఖ్ దేవ్ నగర్ నుంచి నడిమి వంక వరకు గల కాలువలో పేరుకుపోయిన చెత్త మట్టి పూడికను జెసిబితో తొలగించడం జరిగిందని గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని సుఖ్ దేవ్ నగర్ నుంచి నడిమి వంక వరకు గల కాలువలో గల మట్టి చెత్త పూడికను తొలగించి వర్షం వచ్చిన సమయంలో పంచాయతీలోని వివిధ కాలనీలో నీరు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఆర్డీఓ కేశవ నాయుడు ఆదేశించడంతో వారి ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలోని సుఖ్ దేవ్ నగర్ నుంచి నడిమి వంక వరకు గల కాలువలో పేరుకుపోయిన మట్టి చెత్తను జెసిబితో తొలగించి పంచాయతీలోని వివిధ కాలనీలో నివసించే ప్రజలు ఎవరు వర్షం నీరు చేరి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ఎన్‌సిసి క్యాంపును సందర్శించిన కర్నూల్ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాటి
## - అంతర్జాతీయ యోగా శిబిరాలకు క్యాడెట్‌లను సిద్ధం చేయమని సూచన


ఎన్.సి.సి క్యాంప్ అధికారులకు సూచనలిస్తున్న అధికారులు

కూడేరు, మే 30 ప్రభాత వార్త
మండల పరిధిలోని గోటుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని లేప్రోసి కాలనీ ప్రక్కన నిర్వహిస్తున్న 6వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి క్యాంపును శుక్రవారం కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాటి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్సిసి క్యాడెట్ల శిక్షణా శిబిరాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అంతర్జాతీయ యోగా శిబిరాలకు క్యాడెట్లను సిద్ధం చేయాలని సూచించారు. వికసిత్ భారత్ 2047 పైన క్యాడెట్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీటి స్టాఫ్ ఏఎన్‌ఓలు పావని, నవీన్ కుమార్, ఎంఎండి మొదస్సర్, ఎం.సంతోష్‌లు మాట్లాడారు.ఈ క్యాంపులో అన్ని రకాల శిక్షణ కార్యక్రమాలను చూసి ఆయన వారిని అభినందించారు.

# అనంతలో సచివాలయ ఉద్యోగిపై అనంతపురం టిడిపి చోటా నాయకుడి దూషణల పర్వం

అనంతపురం, మే 30 ప్రభాతవార్తబ్యూరో
అనంతపురం నగరంలో ఒక టీడీపీ నాయకుడు ఒక సచివాలయ ఉద్యోగిపై బూతులు తిట్టారు. ఇందుకు సంబంధించిన ఒక వాయిస్ మెసేజ్ వాట్సాప్ గ్రూపులో వైరల్‌గా మారుతోంది. సచివాలయ ఉద్యోగిపై ఇష్టం వచ్చినట్లు తిట్టడంపై చర్చనీయాంశంగా మారింది. మహానాడు కార్యక్రమానికి జనాన్ని తరలించలేదని కారణంతో టిడిపి నాయకుడు రాజేష్‌నాయుడు సచివాలయం ఉద్యోగిపై విరుచుకు పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. డీఎంహెచ్వో కార్యాలయం వద్ద టిడిపి వర్గీయుడు రాజేష్ నాయుడు హోటల్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కడపలో జరిగిన మహానాడుకు జనాన్ని తరలించే విషయంలో అరవింద్ నగర్ సచివాలయ ఉద్యోగి అశ్వత్ రెడ్డిపై రాజేష్ నాయుడు ఫోన్లో దుర్భాషలాడినట్లు తెలుస్తోంది. నువ్వు ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తాను అంటూ రాజేష్ నాయుడు సచివాలయ ఉద్యోగిని బెదిరించినట్లు తెలుస్తోంది. టిడిపి వర్గీయుడు రాజేష్ నాయుడు బెదిరింపులపై సచివాలయ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ వివాదానికి కారణమేమిటని తెలుసుకునే పనిలో పోలీస్ అధికారులు ఉన్నారు. ఇదే సమయంలో సచివాలయ ఉద్యోగ సంఘాలు సమావేశం అయ్యేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మారుతినాయుడు నియామకం


వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతినాయుడు

అనంతపురం సిటీ, మే 30 ప్రభాతవార్త
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా గొర్ల మారుతినాయుడును నియమిస్తూ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులను జారీ చేశారు. వైఎస్ఆర్‌సిపి ఆవిర్భావం నుంచి యువజన విభాగంలో క్రియాశీలకంగా పని చేస్తున్న గొర్ల మారుతినాయుడును రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనను రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం యువతకు జరుగుతున్న అన్యాయంను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు.

# మహానాడు విజయవంతం చేసి క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చిన కార్యకర్తలకు కృతజ్ఞతలు
## - అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త
దేవుని గడప కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడుకు తరలివచ్చి కనీవినీ ఎరుగని విధంగా విజయవంతం చేసిన పసుపు సైనికులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలియచేశారు. దార్శనిక నేత నారా చంద్రబాబునాయుడుపై నమ్మకం, భావితరపు నాయకుడు నారా లోకేష్‌పై వున్న విశ్వాసం ప్రతి ఒక్కరిలో స్పష్టంగా కనిపించిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి నిజమైన బలంగా నిలిచి మహానాడును విజయవంతం చేసిన అనంతపురం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మహానాడు మహా సంబరాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా, కార్యకర్తలకు అసౌకర్యం కలుగకుండా నిర్వహించిన పార్టీ యంత్రాంగానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

# యల్లమ్మ, పెద్దన్న దేవాలయాలకు విరాళం
## - వైఎస్ఆర్‌సిపి నాయకులు దాసరి వెంకటరమణ


దాసరి వెంకట రమణ

శింగనమల, మే 30 ప్రభాతవార్త
తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలం చిత్తచేడు గ్రామంలో యల్లమ్మ, పెద్దమ్మ దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండల పరిధిలోని నాగల గుడ్డం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సిపి నాయకులు దాసరి వెంకట రమణ, ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.10వేలు విరాళం అందించారు.

# నేడు చెట్టు పుస్తకావిష్కరణ

అనంతపురం వైద్యం మే 30 ప్రభాతవార్త
ప్రముఖ ద్విభాష , కవి హిందీ పండిట్ జూటూరు షరీఫ్ రచించిన చెట్టు (వచన శతకం) పుస్తకావిష్కరణ నేడు నార్పల మండలంలోని బి పప్పూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చికిచెర్ల ఓబిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు జూటూరు షరీఫ్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో భాగంగా పుస్తకావిష్కరణ సైతం చేయనున్నట్లు ఈ కార్యక్రమానికి శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆచార్యులు బాలసుబ్రమణ్యం ప్రసిద్ధ కవి చంద్రశేఖర్ శాస్త్రి మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ నార్పల మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
## - ఆర్‌డిఓ వివిఎస్ శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ వివిఎస్ శర్మ

కదిరి, మే 30 ప్రభాతవార్త
చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని కదిరి ఆర్డిఓ వివిఎస్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 34వ వార్డులో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డిఓ వివిఎస్ శర్మ, డిఎస్‌పి శివనారాయణస్వామి, పట్టణ సిఐ డివి.నారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ తహశీల్దారు ఈశ్వర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను పట్టించుకోవద్దని, వార్డుల్లో ఒకరికొకరు కలిసి కట్టుగా జీవనం సాగించాలని, గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఎస్‌పి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ


ఆటోను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త
అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని కూడళ్ళు, జాతీయ రహదారుల్లో శుక్రవారం పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్‌లకు దూరంగా వుండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవన్నారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లు వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం వుందని కావున తల్లిదండ్రులు వారిపై నిఘా వుంచి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని పోలీసులు హెచ్చరించారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టీవ్ నెంబర్ ప్లేట్లు, అనధికార పార్కింగ్ తదితర ఉల్లంఘనలకు జరిమానాలు విధించాలని జిల్లా ఎస్‌పి పి.జగదీష్ పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు.